క్లుప్తంగా

అభినందన..



అజయ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా రెండవసారి నియమితులైన కొండూరు అజయ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విజయవాడలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



బజారువీధి కలశం అమ్మవారు

గూడూరు రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదిరోజులపాటు జరిగిన దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. పట్టణంలోని శ్రీనారాణమ్మ పేరంటాళ్లు, బజారువీధి కలశం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, మహిషాసురమర్దిని నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందాలని ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే ప్రతి సచివాలయంలో ప్రజలకు ఉపయోగపడే సర్వీసులు ఉంచాలని కోరారు. జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

కనులపండువగా గ్రామోత్సవం



కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

రాపూరు: రాపూరులోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో పదిరోజులుగా నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కన్యకాపరమేశ్వరిదేవి గ్రామోత్సవాన్ని ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో కొలువుదీర్చి వివిధరకాల ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి పట్టణ పురవీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటి వద్ద భక్తులు కర్పూరహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట



గూడూరురూరల్: పట్టణంలోని బొడ్డుచౌక వద్ద కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి నూతన ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా వేదపండితులు విగ్రహ ప్రతిష్ట చేశారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు పొనకా శివకుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కండలేరులో 11.466 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 11.466 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు

ఆరోగ్య సురక్ష..ప్రజలకు రక్ష



వెంకన్నపాళెంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



చిల్లకూరు: బల్లవోలులో కిట్ల పంపిణీ

కోట: వెంకన్నపాళెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ భవాని ప్రారంభించారు. డాక్టర్ నాగరాజు పర్యవేక్షణలో వైద్యబృందం వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు వలిపి శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, మల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు: స్థానిక ఎస్‌ఏఎల్‌సీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి కంటి అద్దాలు అందజేశారు. వైద్యులు కమలశ్రీ, శశికుమార్, హెల్త్ అసిస్టెంట్ ముత్యాలయ్య శ్రీకాంత్, ఎంపీడీఓ గోపీనాథ్, సర్పంచ్, ఉప సర్పంచ్ వెంకటరత్నమ్మ, రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాతు రామకృష్ణ, వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కె. దామోదర్‌రెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, కె. రామలింగారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: బల్లవోలు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురు వైద్య పరీక్షలు చేసుకున్నారు. కంటి పరీక్షలు చేసుకున్న వారికి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి తిరుపతిలో కంటి వైద్యశాలకు సిఫార్సు చేశారు. చింతవరం వైద్యులు పాల్ జాన్సన్, ఎంపీడీఓ నిర్మలాదేవి, ఈఓపీఆర్‌డీ మాణిక్యం, సర్పంచ్ దువ్వూరు మంజులమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వి.మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: మండలంలోని కొరిడి, దామరాయి, కడపత్ర పంచాయతీలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 650 మందికి శిబిరంలో వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్యులు ఐ.రమణయ్య తెలిపారు.

రాపూరులో..

రాపూరు: సంక్రాంతిపల్లి సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు మమత, ప్రమీలరాణి, మధుసూధన్, సూర్యధర్మేంద్ర వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ అప్పాజి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు కోటేశ్వరరెడ్డి, బాలకృష్ణారెడ్డి, చెన్నుభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: కల్లూరు గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్యులు చైతన్య, తరుణ్ సాయికుమార్, మౌనిక, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: నెలబల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ ఉమ, రాజశేఖర్, సందీప్, విష్ణుప్రియ, శ్రీకాంత్, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, సర్పంచ్ కమలమ్మ, కార్యదర్శి మధుమోహన్ పాల్గొన్నారు.



వాకాడులో మందుల పంపిణీ



సూళ్లూరుపేటలో..



రాపూరులో కిట్ల పంపిణీ



కల్లూరులో వైద్యపరీక్షలు



నెలబల్లిలో కిట్ల అందజేత

తెలుగుగంగ సముదాయానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ప్రారంభించిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: తెలుగుగంగ 7వ బ్రాంచ్ కాలువకు సంబంధించి నాయుడుపేట డివిజన్ కార్యాలయం వద్ద రూ.83 లక్షలతో నూతనంగా కార్యాలయ నిర్మాణ సముదాయానికి బుధవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శంకుస్థాపన చేసి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. తెలుగుగంగ జిల్లా ఎస్‌ఈ కే హరినారాయణ రెడ్డితో పాటు ఆ శాఖ అధికారులు పాల్గొని తెలుగుగంగ కార్యాలయ భవన సముదాయంలో ఉండే అధికారుల గదుల నిర్మాణ విషయాలను ఎమ్మెల్యేకు వివరించారు. ముందుగా ఎమ్మెల్యేతోపాటు జిల్లా అధికారులను స్థానిక తెలుగుగంగ అధికారులు సత్కరించారు. ఈ ప్రాంగణంలోనే ఇరిగేషన్ శాఖకు సంబంధించి కార్యాలయం కూడా ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలుగుగంగ ఈఈలు డి. రాధాకృష్ణమూర్తి, కె.శ్రీనివాసరావు, డీఈలు రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, గజేంద్రరెడ్డి, నందగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ కె.దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, కె.సుమ, నేతలు టి.సుబ్రహ్మణ్యంరెడ్డి, టి. జనార్దన్‌రెడ్డి, బి.మల్లికార్జున రెడ్డి, కే జయరామయ్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

ఓజిలి: మండలంలోని ఇనుగుంట సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నేడు గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు. సచివాలయం పరిధిలోని రావిపాడు, ఇనుగుంట గ్రామాల్లోని ప్రజలు వైద్యపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న సర్వసభ్య సమావేశం

వెంకటగిరిరూరల్: వెంకటగిరి రూరల్ మండలానికి సంబంధించి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 28న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు ధర్మ ప్రచార రథయాత్ర

సైదాపురం: శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మ ప్రచార వారోత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఉదయం 5గంటల నుంచి స్వామి అమ్మవార్ల ధర్మ ప్రచార రథయాత్ర ప్రారంభమవుతుందని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మన్నారపు రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో సైదాపురంలోని ఉన్నత పాఠశాలలో సాయంత్రం 6గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

కలువాయి: ఓపెన్ స్కూల్ విధానం ద్వారా పది, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు కలువాయి మండలం చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్. జనార్దన్‌రెడ్డి బుధవారం ఓప్రకటనలో తెలిపారు. మండలంలో మధ్యలో బడి మానేసిన వారు, తిరిగి చదువుకోవాలనే ఆసక్తి ఉన్నవారు, పది ఫెయిల్ అయిన వారు, కనీస విద్యార్హత కావాలనుకునే వారు, ప్రమోషన్ కోసం తగిన విద్యార్హత కావాలనుకునేవారికి ఇది సదవకాశమని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో పదవ తరగతిలో చేరాలనుకునేవారు 14 సంవత్సరాలు వయసు కలిగి ఎటువంటి విద్యార్హతలు లేకున్నా జనన ధ్రువీకరణ పత్రం, రికార్డుషీట్, బదిలీ సర్టిఫికెట్‌తో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. 15 సంవత్సరాలు వయసు కలిగి ఉండి ఇంటర్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన వారు ఆధార్ జిరాక్స్, ఫొటో, ప్రాథమిక ధ్రువీకరణలతో పాఠశాలలో సంప్రదించాలన్నారు. నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వడంతో పాటు ప్రతి రెండవ శనివారం, ప్రతి ఆదివారం తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



కుంభాభిషేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్: తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున అభయ అనుగ్రహ వేంకటేశ్వరస్వామి ఆలయ మహారాజగోపుర కలశ ప్రతిష్ట కుంభాభిషేకాన్ని వేదపండితులు బుధవారం అత్యంత వైభవంగా జరిపారు. తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, శోభమ్మ దంపతులు సహకారంతో నిర్మించిన మహారాజగోపురం కలశ ప్రతిష్ట, కుంభాభిషేక వేడుకలను తెలంగాణ సీఎం సమీప బంధువు, ఆలయ పర్సన్‌ఇన్ మేనేజ్‌మెంట్ కె. నరసింహరావు, ఆలయ వ్యవస్థాపకులు పద్మనాభస్వామి ఘనంగా నిర్వహించారు. టీటీడీ పూర్వాచార్యులు ఉదయగిరి అనంత నారాయణాచార్యుల సారథ్యంలో వేదపండితులు ఆలయం వద్ద స్వామి వార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. జరిపారు. యాగ మండపంలో ప్రత్యేక హోమపూజలను నిర్వహించారు. మహారాజ గోపురంపై కలశాలను ప్రతిష్టించి కుంభాభిషేక వేడుకలను భక్తుల నడుమ వైభవోపేతంగా జరిపారు.

మృతదేహాల అప్పగింత

నాయుడుపేటటౌన్: బిరదవాడ గ్రామ సమీపంలో మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం జరిపి మృతదేహాలను సీఐ నరసింహారావు సమక్షంలో కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఒక్కగానొక్క కుమారుడు కోల్పోయి..

బిరదవాడకు చెందిన తుమ్మా దశయ్య, గిరివాణి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు ఆనంద్‌బాబు(23). ఇతను మేనకూరు సెజ్‌లోని ఓ ఫార్మా పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆధారంగా ఉన్నాడు. స్నేహితుడు కార్తీక్‌తో కలిసి దసరా రోజు ద్విచక్రవాహనంలో గుడికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అతన్ని మృత్యువు కబళించింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడనుకున్న కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు ఆపడం ఎవరితరమూ కాలేదు.

ఉన్నతంగా రాణిస్తాడని..

తమ బిడ్డ కార్తీక్(19) ఇంజినీరింగ్ చదివి ఉన్నతంగా రాణిస్తాడని భావించిన తల్లిదండ్రులు బాలపెంచలయ్య, చెంగమ్మ కడుపు కోత మిగిల్చి వెళ్లిపోయాడంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

కూలీల కోసం వచ్చి..

ముత్తుకూరు మండలం పచ్చికోళ్లమిట్ట గ్రామానికి చెందిన ఆవుల మురళి (52) వారినాట్లు వేసే కూలీల కోసం వచ్చి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రొక్లైనర్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ప్రొక్లైనర్

సైదాపురం: అక్రమ ఖనిజ సంపద కోసం తవ్వకాలు సాగిస్తున్న ప్రొక్లైనర్‌ను బుధవారం పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ చల్లావాసు మాట్లాడుతూ మర్లపూడి గ్రామంలో ఓ పట్టాపొలంలో భూ యజమానికి తెలియకుండా అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు వచ్చిందిని, దీంతో యజమాని ఫిర్యాదు మేరకు తవ్వకాల సాగిస్తున్న ప్రొక్లైనర్‌ను సీజ్ చేశామన్నారు.

మేధోశక్తి పరీక్షలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

దక్కిలి (బాలాయపల్లి): విద్యార్థుల మేధోశక్తి పరీక్షలు నవంబర్ 3వ తేదీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం బాలాయపల్లిలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు బాలాయపల్లి మండలంలోని 25 పాఠశాలలు, దక్కిలి మండలంలో 28 పాఠశాలలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఇందులో 3, 6,9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షలపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన హెచ్‌ఎంలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బీరం ప్రదీప్ పాల్గొన్నారు.

కోలాహలం మూకాంబికాదేవి నగరోత్సవం



నగరోత్సవంలో మూకాంబికాదేవి



ఊంజల్‌సేవలో దుర్గామల్లేశ్వరిదేవి

నాయుడుపేటటౌన్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు రోజు బుధవారం రాత్రి మూకాంబికాదేవి నగరోత్సవం కోలాహలంగా జరిగింది. రాత్రి మూకాంబికాదేవి ఉత్సవమూర్తిని పూలతో అలంకరించి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. స్వర్ణముఖి నది తీరం వద్ద ఉన్న దుర్గామల్లేశ్వరిదేవికి బుధవారం రాత్రి ఏకాంత సేవను భక్తిశ్రద్ధలతో జరిపారు.

పౌష్టికాహార ప్రదర్శన పరిశీలన



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిల్లకూరు: గర్భిణులు, బాలింతలు, రక్త హీనత ఉన్న వారు పౌష్టికాహారం కోసం డబ్బు ఖర్చు చేయాల్సిన పనిలేదని తమకు దగ్గరలో దొరికే వాటితోనే మంచి పౌష్టికాహారం ప్రతిరోజూ తీసుకోవచ్చని చింతవరం వైద్యులు పాల్ జాన్సన్ సూచించారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బుధవారం బల్లవోలు గ్రామంలో ఏర్పాటు చేసి పౌష్టికాహార ప్రదర్శనను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పొలాల వద్ద దొరికే పొనగుంటి ఆకు కూర తింటే కంటి జబ్బులు రాకుండా ఉండడమే కాకుండా రక్త హీనత లేకుండా చూసుకోవచ్చని అన్నారు. అలాగే మునగాకు, పాలకూరతోపాటు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే కోడిగుడ్లు, పాలు క్రమం తప్పక తీసుకుంటూ ఆశా కార్యకర్తలు ఇచ్చే ఐరన్ మాత్రలు వాడుకుంటే చాలని అన్నారు. ఎంపీడీఓ నిర్మలాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.